క్లుప్తంగా

కన్యకా పరమేశ్వరికి విశేష పూజలు



హోమం చేస్తున్న అర్చకులు

గూడూరు: పట్టణంలోని బజారు వీధిలో ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి బుధవారం విశేష పూజలు, అభిషేకాలు, ఘనంగా హోమాలు చేశారు. మహా కుంభాభిషేకం నిర్వహించి 41రోజులు పూర్తయిన సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. వాసవీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

దాతల ఔదార్యం.. భక్తులకు నిత్యప్రసాదం

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాల్లో అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు దాతలు నిత్యం ప్రసాదాలు అందజేశారు. రకరకాల ప్రసాదాలను తయారు చేయించి, భక్తులకు నిత్యం అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. దాతలు సురేష్‌రెడ్డి, ఉమా శంకర్‌రాజు,గిరిధర్‌రెడ్డి, దువ్వూరు సుబ్రమణ్యం రెడ్డి అలియాస్ బుల్లిరెడ్డి తదితరులు సుమారు రూ.5 లక్షలు వెచ్చించి, నిత్యం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి వలంటర్ సంఘం, జూనియర్ చాంబర్, వారం రోజుల పాటు మజ్జిగ అందజేశాయి. దేవాంగ సంఘం వారుకు నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ పాకెట్లును అందజేశారు. పట్టణంలోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణ నిత్యాన్నదాన చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మోదుగుల రమణయ్య వారం రోజుల పాటు అన్నదానం చేశారు.

మత సామరస్యానికి ప్రతీక గూడూరు దర్గా

గూడూరు: మత సామరస్యానికి ప్రతీకగా గూడూరు దర్గాకు గుర్తింపు ఉందని దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని దర్గాలో ముస్లిం నాయకులు, మత పెద్దలతో కలసి గంధోత్సవ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ హజరత్ సయ్యద్ హాషీం హుస్సేనీ జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో ఈ నెల 19వ తేదీ సాయంత్రం 7 గంటలకు జెండా కార్యక్రమం, 22వ తేదీ రాత్రి చందన సేవ జరుగుతుందన్నారు. అలాగే 24వ తేదీ గంధోత్సవం వైభవంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముజావర్ మగ్దూం, సందానీబాషా, షాన్‌వాజ్, అబ్దుల్లా, షానూ, షబ్బీర్, కరీముల్లా, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

భూ పట్టాల పంపిణీకి చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి

గూడూరు: భూములను సాగు చేసుకుంటున్న అనుభవదారులకు పట్టాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఆర్డీఓ కిరణ్‌కుమార్‌తో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. జీఓ నంబర్ 128 ప్రకారం సాగు చేసుకుంటున్న భూములకు అనుభవదారులకే హక్కు కల్పించే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని 535 మంది లబ్ధిదారులకు 346.20 ఎకరాల భూమికి హక్కు లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఓజిలి: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ యనమల ఉమామహేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని బట్లకనుపూరులో అంగన్‌వాడీ సిబ్బందితో కలసి జనభాగీదారి ర్యాలీ చేశారు. కార్యకర్త పీ మల్లీశ్వరి, వాణి, వైఎస్సార్‌సీపీ నేత యనమల గురవయ్య, నిర్మలమ్మ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

సైదాపురం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఏఓ హైమావతి అన్నారు. మండలంలోని కలిచేడు ఆర్బీకేని బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పనికి కాదు..బడికి పంపండి

సైదాపురం: బడి ఈడు పిల్లలను పనులకు పంపవద్దని, తప్పని సరిగా పాఠశాలలకు పంపాలని సైదాపురం సూపర్‌వైజర్ సౌజన్య పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సైదాపురంలో బుధవారంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జన భాగీదారి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది పూజిత, లత, సూజాత, రమ, రమణమ్మ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

చిల్లకూరు: మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిట్టమూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ చిల్లకూరు మండలంలో నెలకొన్న చుక్కల భూముల సమస్యతో పాటుగా సాగరమాల రహదారి నిర్మాణంలో చేపడుతున్న భూ సేకరణ పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు.

తల్లులకు అవగాహన

కలువాయి: మండలంలోని చీపినాపి, వెంకటరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జనభాగీదారి కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు పద్మ, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

తడారిన నేల.. వరించిన గంగ

నాలుగేళ్లుగా వరుణుడు కరుణించాడు.. మేఘం వర్షించింది.. తెలుగు'గంగ' గలగల పారుతోంది.. వెరసి జలవనరులు నిండు కుండలయ్యాయి.. భూగర్భజలాలు పెరిగాయి..బావులు ఉప్పొంగుతున్నాయి.. సాగుకు ఊతమొచ్చింది.. అన్నదాత హలం పట్టి మెట్ట పొలం సైతం దున్ని, పైరు పెట్టాడు.. ఫలితం తడారిన కరువు నేల అయిన వెంకటగిరి నియోజవర్గంలో రికార్డు స్థాయిలో వరిసాగు నమోదైంది.



పరవళ్లు తొక్కుతున్న తెలుగుగంగకాలువ

- అనుకూలించిన వాతావరణం
- పెరిగిన భూగర్భ జలాలు
- మెట్ట ప్రాంతంలో రికార్డుస్థాయి వరి సాగు
- నన్న రకాలు సాగు చేస్తున్న రైతులు

దక్కిలి: వెంకటగిరి నియోజకవర్గం పూర్తిగా మెట్ట ప్రాంతం. నాన్‌డెల్టాగా ఉన్న ఈ ప్రాంతంలో వర్షం కురిసి చెరువులు నిండితేనే పంటలు పండేవి. అయితే నాలుగేళ్లుగా తరుచూ వర్షాలు కురుస్తుండడంతో చెరువులు జలకళతో కళకళలాడుతున్నాయి. అలాగే ఏడాది పొడవునా తెలుగుగంగ నీరు చెన్నైకు విడుదల చేస్తున్నారు. దీంతో దక్కిలి ప్రాంతంలోని రైతులు సైఫన్ పద్ధతి, మూడు, నాలుగు బ్రాంచ్ కాలువలు ద్వారా చెరువుల్లోకి గంగ నీటిని మళ్లించుకుంటున్నారు. దీంతో ఆయుకట్టులో వరి పంట సాగు చేస్తున్నారు. ప్రధానంగా వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో సుమారు 70 శాతానికి పైగా ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో రైతులు కేఎన్ఎం 1638, ఎంటీయూ 1010, నెల్లూరు మసూర తదితర రకాలను సాగు చేస్తున్నారు.

పరవళ్లు తొక్కుతున్న గంగ

కండలేరు–పూండి కాలువలో గంగ జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. ఈ జలాలను సాగునీటిగా వినియోగించుకునేందుకు రైతులకు అధికారులు నుంచి ఎటువంటి అడ్డంకులు లేక పోవడంతో చెరువుల్లోకి గంగనీటిని మళ్లించుకుంటన్నారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 28.778 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో కండలేరు–పూండి కాలువకు 2,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలువ నిండుకుండలా ప్రవహిస్తుంది. దీంతో కాలువకు అనుకుని ఉన్న పొలాల్లోని బోరు బావుల్లో భూగర్భ జలం పెరుగుతోంది. ఈ క్రమంలో మెట్టప్రాంతమైన వెంకటగిరి నియోజకవర్గంలోని రైతులు రెండో కారు ఖరీఫ్ వరి సాగును రికార్డు స్థాయిలో చేస్తున్నారు. ఇప్పటికే కొందరు నాట్లు వేస్తుండగా మరి కొందరు మరో పది రోజుల్లో నాట్లు వేసేందుకు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో వరి పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయశాఖాధికారులు అంచనా వేస్తున్నారు.



వరి సాగుకు దుక్కి చేస్తున్న రైతు

ఖరీఫ్ పంట సాగు వివరాలు..

మండలం	పంట రకం	సాగు(ఎకరాల్లో)
డక్కిలి	వరి	5,500
వేరుశనగ	సాగు	600
బాలాయపల్లి	వరిసాగు	4,500
	వేరుశనగ	100
వెంకటగిరిరూరల్	వరి	3 వేలు
	వేరుశనగ	1,500

అందుబాటులో ఎరువులు



"వెంకటగిరి నియోజవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగుపై రైతులు మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఎరువులు కొరత లేకుండా ముందుగానే అందుబాటులో ఉంచాం. సుమారు 620 టన్నులు ఆర్బీకేల్లో సిద్ధంగా ఉన్నాయి. అవసరమైతే ఎరువులు కోసం ప్రతిపాదనలు పంపుతాం. జనుము, జీలుగ విత్తనాలు కూడా త్వరలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– నాగార్జున సాగర్, ఏడీఏ, వెంకటగిరి

పేదల పక్షపాతి సీఎం జగన్



కర్రబల్లవోలులో మహిళకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

ఓజిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని కర్రబల్లవోలు, వడ్డిపాళెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన వారందరికీ పార్టీలు, వర్గాలు, మతాలు, కులాలు, రాజకీయాలకతీతంగా జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హత ఉండి ప్రభుత్వం తరుపున ఎటువంటి సహాయం అందని వారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకునేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని చెప్పారు. అనంతరం నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకేలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సగుటూరు గ్రామస్తులు బస్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా డీఎంతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్‌నాయుడు, సర్పంచ్‌లు యల్లా సురేష్ రెడ్డి, పంజాం వసంతమ్మ, నాయకులు యల్లా భాస్కర్‌రెడ్డి, గుడ్ల వెంకట్‌రెడ్డి, ముమ్మడి రామయ్య, నెల్లూరు చంద్రమౌళి, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

గూడూరు: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం మీ సొంతమని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత స్టేడియంలోని క్రీడాకారులకు క్రీడా సామగ్రి కోసం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. అలాగే వారికి శక్తి కోసం ఫ్రూట్ జ్యూస్‌లు అందజేశారు. గ్రౌండ్‌లో మూలనపడి ఉన్న జిమ్‌ను కూడా సిద్ధం చేయిస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా నడక, వ్యాయామంతోపాటు పలు రకాల శారీరక శ్రమతో కూడిన క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ క్రీడా మైదానంలో వందలాది మంది రకరకాల వ్యాయామాలు, ఆటలు ఆడుకుంటుంటారని చెప్పారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

జాతర కరపత్రాల ఆవిష్కరణ

గూడూరు రూరల్ మండలంలోని చెన్నూరులో జరుగుతున్న పోలేరమ్మ జాతర కరపత్రాలను ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు బుధవారం ఆవిష్కరించారు. జాతరకు హాజరుకావాలని ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. వైస్ ఎంపీపీ ఎం శ్రీనివాసులరెడ్డి, కే మీరారెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహితపాలనే జగనన్న ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరు: అవినీతిరహిత పాలనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎల్లసిరి, దేవసేనమ్మ, ఆర్డీఓతో కలసి ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అవినీతి రహితపాలన అందించాలనే ధ్యేయంతోనే రివర్స్ టెండరింగ్‌ను తీసుకొచ్చి, చరిత్ర తిరగరాశారన్నారు. ఈ క్రమంలోనే ఏ స్థాయి అధికారులైనా అవినీతికి పాల్పడితే ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఎన్‌ఓసీల విషయంలో ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌ఓసీల మంజూరుకు సంబంధిత సచివాలయాల్లో సంప్రదించాలని, ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రభుత సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ సాయినాథ్, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పార్టీ రూరల్ మండల కన్వీనర్ మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ గురవయ్య పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలు సద్వినియోగం చేసుకోండి

రాపూరు: నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు ఏజీఎం చంద్రశేఖర్‌రావు కోరారు. రాపూరు కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో బుధవారం వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో తమ బ్యాంకు ద్వారా పీఏసీఎస్‌కు సంబంధించిన రుణాలు మాత్రమే ఇచ్చేవారమని, ప్రస్తుతం వ్యవసాయ, వాహన, బర్రెలు, గొర్రెలు, మేకలు వ్యాపార రుణాలు అందిస్తున్నామన్నారు. ఇంటి రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో మేనేజర్ పరందామ, సూపర్‌వైజర్ ఖాసీం, పీఏసీఎస్ సీఈఓ నరసింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏజీఎం చంద్రశేఖర్‌రావు

పల్లెల్లో ప్రగతి చక్రాలు కదలాలి

నాయుడుపేట: పల్లెల్లో ప్రగతి చక్రాలు కదలాలని, ప్రతి పాఠశాలను సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు తోడ్పాటును అందించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కలలను నిజం చేయాలని నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. నాయుడుపేట మున్సిపాలిటీలోని జువ్వలపాళెం పాఠశాలల్లో బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లను చైర్మన్ చేతులు మీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకుని వచ్చారన్నారు. ప్రతి పేదవాడికి అండగా ఉంటూ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకుని వెళ్లాలని సూచించారన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, తదితర కిట్‌లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో గోవ మాధవయ్య, దక్కిలి కృష్ణయ్య పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న జనార్దన్‌రెడ్డి

ఆధార్ లింక్ తప్పనిసరి

సూళ్లూరుపేట రూరల్: రైతు భరోసా పథకం లబ్ధిదారులు తమ బ్యాంక్ ఖాతాలను ఆధార్‌తో తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని ఏడీఏ జి. అనిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 14,980 మంది రైతు కుటుంబాలకు రూ.5,500 చొప్పున నిధులు విడుదల య్యాయని, పలు చోట్ల రైతులు బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ చేసుకోకపోవడంతో ఆ నగదు ఖాతాల్లో జమ కాలేదన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



వెంకటగిరి: కిట్లను పంపిణీ చేస్తున్న చెంచయ్య



సైదాపురం: విద్యార్థులతో భాస్కర్



దక్కిలిలో కిట్లు అందజేస్తున్న ఎంపీపీ

వెంకటగిరి: విద్యార్థులు విద్యలో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బంగారుపేట మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తూపాటి చెంచయ్య అన్నారు. పట్టణంలోని బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం నరేష్, టీచర్లు లక్ష్మీనారాయణ, అప్పిన వెంకటేశ్వర్లు, పారి కృష్ణయ్య, శోభారాణి, బుజ్జమ్మ, చంద్రిక, పీసీ చైర్మన్ జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

సైదాపురం: విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్ అన్నారు. మండలంలోని ఊటుకూరు ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు.

కిట్ల పంపిణీ

డక్కిలి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యాకాను కిట్లను ఎంపీపీ గోను రాజశేఖర్ పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం జిలానీ, సర్పంచ్ వేమక్క, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటరావమ్మ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో కుల, మత పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి రూరల్ మండలంలోని సిద్ధవరం పంచాయతీ పరిధిలో వైఎస్సార్ సీపీ నేత ఆవుల గిరియాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నేదురుమల్లి పాల్గొన్నారు. సిద్ధవరం దళితకాలనీలో స్థానికులు కర్పూరహారతులతో గజమాల, పూలమాలతో ఘన స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిని వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సదారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొండూరు వెంకటరత్నంరాజు, భాస్కర్, ఏఎంసీ చైర్మన్ ధర్మానాయుడు, మాజీ సర్పంచ్ తిరుమల, వేణుగోపాలరెడ్డి, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, ఏఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్ దిశగా ఐఐహెచ్‌టీ అడుగులు

వెంకటగిరి: వెంకటగిరిలోని ఇండియన్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కొత్త ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ఐఐహెచ్‌టీలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని చేనేత జౌళిశాఖ మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.



ఐఐహెచ్‌టీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

మోడల్ కాలనీగా జగనన్న కాలనీ

వెంకటగిరిలోని జగనన్నకాలనీని మోడల్‌కాలనీగా తీర్చిదిద్దుతామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జగనన్నకాలనీలో ఇళ్ల నిర్మాణాలు, టిడ్కో గృహలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ప్రమాదానికి గురైన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వెంకటగిరి కోకన్వీనర్ బొమ్మిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్ చైర్మన్లు ఎస్ బాలయ్య, సీహెచ్ ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు, కమిషనర్ బీవీ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలువాయి తహసీల్దార్‌గా స్వర్ణ

కలువాయి: మండల తహసీల్దార్‌గా జి.స్వర్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గూడూరు ఆర్డీఓ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కలువాయిలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. డీటీ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పంపండి



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రాపూరు: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద కోరారు. వేపినాపి, తాతిపల్లె, శానాయిపాళెం, పాకురుపల్లెలో బుధవారం జనభాగీదారి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి: పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సాలికాలనీ, బొప్పాపురంలో బుధవారం ఉదయం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్లు ప్రభావతి, ఎంఏ నారాయణ, జానకిరామయ్య, వహీదా, పార్టీ పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, మాజీ ఎంపీపీ కడప బ్రహ్మయ్య, నేతలు రవి, వలికల కృష్ణయ్య, నాగ రాజు, ఆవుల గోపాల్‌యాదవ్, చిట్టేటి హరికృష్ణ, ఎల్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

చిల్లకూరు: మండలంలోని తీపనూరులో కృష్ణాలయ స్థలం ఆక్రమణలకు గురవుతుందని, దీనిపై చర్యలు చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాసులుకు బుధవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ కృష్ణ మందిరం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని సంబంధించిన స్థలాన్ని పక్కనే ఉన్న వారు ఆక్రమించుకుని హద్దులు ఏర్పాటు చేసుకుని, తమదేనని వాగ్వివాదానికి దిగుతున్నారని చెప్పారు.

ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ గ్రేడ్

గూడూరు: ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాలకు నేషనల్ అసిస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(ఎన్ఏఏసీ) బీ గ్రేడ్ వచ్చినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ వేంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత నెల 18, 19 తేదీల్లో న్యాక్ కమిటీ సభ్యులు తమిళనాడు నుంచి ప్రొఫెసర్ నటరాజన్, బెంగళూరు నుంచి టీజీ వెంకటేశ్వర్లు, చండీఘడ్ నుంచి ప్రొఫెసర్ వినయ్ ఆనంద్ బౌరవి కళాశాలను సందర్శించారన్నారు. ఈ మేరకు వారు కళాశాలలోని వసతులు, అధ్యాపకుల బోధనా పద్ధతులు, ఇతర అంశాలను మదింపు వేసి గ్రేడ్‌ను సిఫార్సు చేశారన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వై శ్రీనివాసులు, కనీనర్ కే శివప్రసాద్, గోవిందు, సురేంద్ర, వ్యాయామ అధ్యాపకులు పీ నారాయణరాజు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



హీరోయిన్ హనీరోజ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే



దేవతామూర్తుల నృత్యరూపకంలో కళాకారులు

సూళ్లూరుపేట రూరల్: చెంగాళమ్మ తిరునాళ్ల భాగంగా జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున సినీ హీరోయిన్ హనీరోజ్ పలకరింపు అందరిని ఉర్రూతలూగించింది. సినీ ప్లేబ్యాక్ సింగర్లు కీర్తనాశర్మ, స్వర గో పురం ఆర్కెస్ట్రా ఆకట్టుకుంది. వెంకీ మంకీ బృందం, జబర్దస్త్ యాంకర్ అమ్ము హాస్యవల్లరి అందరిని కడుపుబ్బ నవ్వించింది. ఢీ ఫేమ్ సందర్శన్ బృందం డ్యాన్స్ అందరిని అలరించింది. సాయి హేమంత్ నాశికా వేణుగానం ప్రేక్షలకలను ఉత్సాహం నింపింది.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

సైదాపురం: భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సైదాపురం మండలంలోని తురిమెర్లలో సర్పంచ్ అడసనపల్లె జయమ్మ అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై పలువురు రైతులు అధికారులకు అర్జీలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సుల ద్వారా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మనోహర్, ఆర్ఐ అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్

దరఖాస్తుల ఆహ్వానం

కలువాయి: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి అర్హులైన వారు ఈ నెల 16వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అప్పాజీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 17వ తేదీన దరఖాస్తులు పరిశీలన, 19వ తేదీన మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18–35 ఏళ్ల మధ్య వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.